క్లుప్తంగా

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

విజయవాడ కల్చరల్: మహిళా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే, పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సంప్రదాయ వంటల పోటీలను దుర్గాపురంలోని సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించింది. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ మహిళలు సామాజిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనను స్వాగతించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. శ్రీదేవి సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి మాట్లాడుతూ సంస్థ ద్వారా సాంస్కృతిక పోటీలతో పాటు సృజనాత్మకతను చాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ ముగ్గుల పోటీలు, దసరా మహోత్సవాల సమయంలో విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వంటల పోటీల్లో 300 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. నవీన్, మోహన్‌రావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

నిరుపేదలకు అండగా లలితా ట్రస్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజల అవసరాలు తీరుస్తూ వారికి అండగా క్లే లలితా ట్రస్ట్ ఉంటుందని ఆ ట్రస్ట్ డైరక్టర్లు క్లే సీతామహాలక్ష్మీ, జయదుర్గలు అన్నారు. సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద సోమవారం నిరుపేదలకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లలిత ట్రస్ట్ ద్వారా నగరంలోని అభాగ్యులకు, నిరుపేదలకు తమవంతు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు క్లే నాగేశ్వరరావు, మేఘవాణి, ముప్పూరి హరీష్, ఎం జశ్విన్, జీ ధృవన్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వీఎంసీ స్పందనలో ఏడు అర్జీలు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులకు వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సీఈ ప్రభాకర్ తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని వాయిస్ సెక్షన్‌లో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో సోమవారం స్పందన నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాల ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఏడు అర్జీలు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగంపై-3, పట్టణ ప్రణాళిక-3, ఎస్టేట్-1 ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి స్వీకరించిన ఫిర్యాదులను ఆ శాఖాధిపతులకు పంపి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) రోహిణి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ -3 డాక్టర్ బాబు శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లత, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జగదీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు సరస్వతీ దేవిగా దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీపంచమిని పురస్కరించుకుని 14వ తేదీ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌తో పాటు లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. త్వరలో జరగనున్న వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అర్చకులు ఆశీర్వదిస్తారు. అమ్మవారి ప్రధాన ఆలయంలోఅర్చకులు సరస్వతీ మంత్ర హవనం చేసి విద్యార్థులకు అందజేసే పెన్నులతో పాటు అమ్మవారి కంకణాలకు పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులకు పెన్ను, కంకణంతో పాటు చిన్న సైజు ఫొటో, కుంకుమ ప్రసాదాలను పంపిణీ చేస్తారు. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల కోసం లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రధానాలయంలో విద్యార్థులకు ముఖ మండప దర్శనానికి అనుమతిస్తారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం, స్కూల్, కాలేజీ గుర్తింపు కార్డును ధరించిన వారికి మాత్రమే పెన్నులను అందజేస్తారు.

నేడు 63వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఉదయం 63వ డివిజన్ న్యూరాజీవ్‌నగర్ నుంచి కండ్రిక వెళ్లే ప్రాంతంలో సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నిర్వహిస్తారని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నది.

సెంట్రల్‌లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు

సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని.. సెంట్రల్‌లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నట్లు సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 26వ డివిజన్ చుట్టుగుంటలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, పార్టీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల గొల్లభామ నాగేశ్వరరావుతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేశామన్నారు. కుల మత, రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో అందినకాడికి దండుకున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. చంద్రబాబుకు పొత్తులపై ఉన్న ప్రేమ ప్రజాసంక్షేమంపై లేదని అన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని వెలంపల్లి అన్నారు. తాము ఏం చేశామో చెప్పుకోవడానికి బోలెడు పథకాలు ఉన్నాయని.. కానీ టీడీపీ నేతలు ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పుకునేందుకు కనీసం ఒక్కటి కూడా లేదని విమర్శించారు. టీడీపీ నేతలకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. బోండా ఉమా అసలు తనకు



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పోటీయే కాదని రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో తాను 25 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలవబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో ఉండగా భూ కబ్జాలు, రౌడీయిజం, అవినీతి అక్రమాలతో పాలన సాగించిన బోండాకు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

పవర్‌లేని పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్

సినిమాల్లో మాత్రమే పవన్‌కళ్యాణ్ పవర్‌స్టార్ అని రాజకీయాల్లో మాత్రం గుండు సున్నా అని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. పార్టీ పెట్టిన పది సంవత్సరాల్లో టీడీపీ, ప్యాకేజీ కోసం మాత్రమే పని చేశారని దుయ్యబట్టారు. పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. అవినీతికి కేరాఫ్ అయిన బోండా ఉమా ఓటమి భయంతో ఎమ్మెల్యే వెలంపల్లి, తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని యుక్తులు కుయుక్తులు పన్నినా సెంట్రల్‌లో బోండాకు పరాభవం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు
- 58వ డివిజన్‌లో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడాన్ని చేతల్లో చేసి చూపిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 58వ డివిజన్ తోటవారివీధి తొమ్మిదో లైన్‌లో రూ. 20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, ఆంధ్రపత్రికకాలనీ ఏడో లైన్‌లో మరో రూ. 20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గత టీడీపీ అసమర్థ పాలన కారణంగా తమపై పని భారం మరింత పెరిగిందని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో టీడీపీ ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజావసరాలను తీర్చడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయలేదని చెప్పారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అక్షరాల రూ. 26.12 కోట్లతో డివిజన్‌ను అభివృద్ధి చేశామని వెల్లడించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి న్యూరాజరాజేశ్వరిపేట మధ్య కాలనీలన్నీ తమ ప్రభుత్వంలోనే 90 శాతం వరకు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ప్రధానంగా రెండు కోట్ల రూపాయలతో తోటవారివీధిలోని అంతర్గత రహదారుల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నట్లు వివరించారు. అలాగే తమ్మిన దుర్గారావునగర్, గ్రీన్‌స్ట్రీట్ ఏరియా, షణ్ముఖ సాయినగర్, సన్‌సిటీకాలనీ మెయిన్ రోడ్డు, న్యూఆర్‌ఆర్‌పేట వెల్ల ప్రధాన రహదారి, భరత మాత మందిరం మెయిన్ రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. ఐదు కోట్ల రూపాయలతో పైపుల రోడ్డు జంక్షన్ నుంచి జక్కంపూడి జంక్షన్ వరకు 5.3 కి.మీ. మేర చేపట్టిన బీటీ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నట్లు చెప్పారు. అలాగే డివిజన్‌లో 6.50 కి.మీ. మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లను వేశామన్నారు. వైవీ రావు ఎస్టేట్‌లో రూ. 4.83 కోట్లతో చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వేసవి నాటికి వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. దశాబ్దాలుగా నందమూరి నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపిందని.. త్వరలోనే వీరందరికీ హక్కుతో కూడిన పట్టా అందజేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, శర్మ, కృష్ణమోహన్, తోట వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి, శివ, యక్కల మారుతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలి

కృష్ణా వర్శిటీ పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శేషయ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్రీడాకారులు అన్ని రంగాల్లోనూ రాణించి చక్కని విజయాలను అందుకోవాలని కేబీఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు సోమవారం ఆ కళాశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన శేషయ్య మాట్లాడుతూ క్రీడాకారులు అన్ని రంగాల్లోనూ రాణిస్తారన్నారు. గెలుపోటములకు అతీతంగా విద్యార్థులందరూ పోటీలకు హాజరుకావాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల 58 సంవత్సరాలుగా క్రీడా రంగంలో మంచి గుర్తింపు పొందిన క్రీడాకారులను తయారు చేసిందన్నారు. కార్యక్రమాన్ని కళాశాల క్రీడా విభాగాధిపతి డి. హేమచంద్రరావు నిర్వహించారు. ఈ పోటీలకు యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేయటానికి సెలక్షన్ కమిటీ మెంబర్‌గా డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైలవరం వ్యాయామధ్యాపకుడు మన్నే స్వామి, ఎస్ఏఎస్ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు బాయన రాములు తదితరులు పాల్గొన్నారు. మొదట నాకౌట్ పద్ధతిలో పోటీలు జరిగాయి. డీఏఆర్ కళాశాల (నూజివీడు) డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (మైలవరం) మీద 10-2 గోల్స్‌తో విజయం సాధించి లీగ్ టోర్నమెంట్‌లోకి ప్రవేశించారు. రెండవ నాకౌంట్లో కేబీఎన్ పీబీ సిద్దార్థ మీద 26-8 స్కోర్‌తో విజయం సాధించి లీగులోకి ప్రవేశించింది. లీగ్ పోటీల్లో మొదటగా కేబీఎన్ కళాశాల ఎస్‌ఆర్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలపై 26-6. ఆధిక్యతతో సాధించింది. అలాగే డీఏఆర్ కళాశాల వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (నున్న) మీద 19-10 ఆధిక్యతతో విజయం సాధించింది మంగళవారం మిగిలిన లీగ్ పోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి బహుమతులు అందించనున్నారు.

రూ. 10 లక్షలతో ఓపెన్ డ్రైనేజీ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ మెయిన్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన ఓపెన్ డ్రైనేజీని రూ. 10 లక్షలతో మరమ్మతుల పనులు చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి సోమవారం డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత క్రమంలో మురుగు కాలువల నిర్మాణం పనులు చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ సుబ్బారెడ్డి, మాదినేని కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్థంభాల తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందిగా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను సోమవారం విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. దావు బుచ్చయ్య కాలనీ మెయిన్ రోడ్డు విస్తరణ చేశారు. దీంతో రోడ్డు పక్కన ఉండే విద్యుత్ స్థంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చాయి. స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచనల మేరకు అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించారు. మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ శివారెడ్డి పర్యవేక్షణలో విద్యుత్ స్థంభాలు తొలగించారు.

ఘనంగా శ్రీశివనేశన్ ఆరాధన దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన శ్రీశివనేశన్ స్వామివారి ఆరాధన దినోత్సవం ఘనంగా జరిగింది. శ్రీశివనేశన్ స్వామివారికి ప్రత్యేక పూజలు, పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి కే రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): పేద చిరు వ్యాపారులకు వెలంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కార్యాలయం వద్ద తోపుడు బండ్లను పంపిణీ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చిరు వ్యాపారులకు ఇచ్చిన మాట ప్రకారం తోపుడు బండ్లను వెలంపల్లి ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులు వెలంపల్లి రాఘవ నరసింహారావు, కే విద్యాధరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● డాక్టర్ పట్టాభిరామయ్యకు సత్కారం



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి సీనియర్ డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య మిత్ర బృందం ఏర్పాటు చేసిన వృత్తి విరామ అభినందన సత్కార సభకు సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, డాక్టర్ జయప్రకాష్ నారాయణ, కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. డాక్టర్ పట్టాభిరామయ్యను మిత్ర బృందం ఘనంగా సత్కరించింది. జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ వైద్య రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన కామినేని పట్టాభిరామయ్య ఆదర్శప్రాయుడని అన్నారు. విలువలతో కూడిన జీవితాన్ని ప్రారంభించిన ఆయన వైద్య రంగంలో విశేషమైన సేవ చేశారని కొనియాడారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా సమాజానికి నిస్వార్థ సేవలందించారని పేర్కొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జువెనైల్ హోమ్‌లోని పిల్లలకు క్రీడల్లో శిక్షణ



జువెనైల్ హోమ్‌లో పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతున్న అనిల్‌కుమార్, ప్రసాదమూర్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గల ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహాల్లో (జువెనైల్ హోమ్) ఉంటున్న పిల్లల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రూపొందించిన 'నయా దిశ' (స్కిల్ ఫర్ జువెనైల్స్) ప్రాజెక్ట్‌ను సంస్థ ఛైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా హోమ్‌లోని పిల్లలకు బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్ క్రీడల్లో శిక్షణ ఇవ్వటంతో పాటు ఆయా క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్స్ కూడా ఐఓసీ అందజేస్తుంది. ఈ సందర్భంగా విద్యాధరపురం కబేళా రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ బీడీవీ ప్రసాదమూర్తి, ఐఓసీ స్టేట్ హెడ్ (తెలంగాణ-ఆంధ్రప్రదేశ్) బి.అనిల్ కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హోమ్‌లోని పిల్లల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. క్రీడల వలన క్రమశిక్షణ, టీమ్ వర్క్ అలవడుతుందన్నారు. హోమ్‌లోని పిల్లలు ఆయా క్రీడల్లో నిష్ణాతులయ్యే వరకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దుతారని చెప్పారు. ముఖ్యంగా వారిలోని నేర ప్రవృత్తిని పోగొట్టి సమాజంలో భాగస్వాములుగా తయారు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఐఓసీ డీజీఎం (హెచ్‌ఆర్) వి.కుమార్, జువెనైల్ హోమ్ చీఫ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ టి.మధుసూదనరావు, సూపరింటెండెంట్ పి.రామమోహన్‌రెడ్డి, ఐఓసీ మేనేజర్లు విద్యాధర్, లలిత్‌బాబు, గౌతమ్‌కుమార్ రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

15 అఖండ ఖచ్చపీ మహోత్సవం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో 15వ తేది గురువారం సంస్థ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా అఖండ ఖచ్చపీ(వీణా వాద్య సమ్మేళనం) దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం ఎనిమిది గంటలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి రచించిన ఘన రాగ పంచరత్న కృతులను గానం చేస్తారని తర్వాత వీణా వాద్య సమ్మేళనం, రాత్రి తొమ్మిది గంటల వరకు వీణ కచేరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ వై రాఘవేంద్రరావు, సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

బీఎల్‌ఎస్ పద్ధతులపై అవగాహన పెరగాలి

దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు



బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై అవగాహన సదస్సులో పాల్గొన్న దంత వైద్యులు, విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాణాపాయ సమయంలో అత్యవసరంగా అందించే బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ (ఓఎంఎఫ్ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్తా ఆంధ్రా బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ, దవడ ఎముకలకు గాయాలు కాకుండా వాహనదారులు హెల్మెట్ వాడాలని చెప్పారు. ప్రాణాపాయం సమయంలో అందించే పల్మనరీ రీసస్‌సిటేషన్ (పీసీఆర్) ఆ వ్యక్తికి పునర్జన్మను ప్రసాదిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారు సడన్‌గా గుండె ఆగిపోయే అవకాశం ఉందన్నారు. అలాంటి వారికి ఈ విధానం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై దంత వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఓఎంఎఫ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ కె.సురేఖ, డాక్టర్ సీహెచ్ రామసునీల్, డాక్టర్ భువన్‌చంద్, డాక్టర్ అజయ్ బెనర్జీ, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదాన్ని పంచేలా పార్కుల సుందరీకరణ



ఆంధ్రరత్న పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా సెంట్రల్ నియోజకవర్గంలో రూ. 28 కోట్లతో 95 శాతం పార్కుల పనులు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు కోటి రూపాయలతో అల్లూరి సీతారామరాజు పార్కు ఆధునీకరణ పనులకు మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా దశల వారీగా పార్కులను అభివృద్ధి చేస్తున్నటు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పాయకాపురం చెరువు ఆక్రమణలకు గురికాగా.. తమ ప్రభుత్వంలో రూ. 3.71 కోట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ప్రారంభించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, వాటర్ ఫౌంటెన్, వాటర్ సప్లై, ఫెన్సింగ్ పనులు త్వరలో పూర్తి చేసి పార్కును అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నూరు శాతం సఫలీకృతమైందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించి మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, నాయకులు గుండె సుందర్‌పాల్, ఒగ్గు గవాస్కర్, చింత పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రరత్న పార్కు ప్రారంభం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 33వ డివిజన్‌లోని ఆంధ్రరత్న పార్కును ఎమ్మెల్యే మల్లాది విష్ణు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ. 20 లక్షలతో ఆంధ్రరత్న పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదే విధంగా సత్యనారాయణపురంలో యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రూ. 2.50 కోట్లతో చేపట్టిన యూజీడీ సంపు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే వాటిని ప్రారంభించన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాసరావు, నాయకులు మైలవరపు రామకృష్ణ, సనత్, చాంద్‌శర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

రేడియో కేంద్రంలో షరీఫ్ కథల ప్రసారం



విజయవాడ కల్చరల్: ప్రముఖ కథా రచయిత, పరిశోధకుడు వేంపల్లి షరీఫ్ కథలు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ప్రసారానికి ఎన్నికైనట్లు ప్రసార భారతి అధికారుల నుంచి సమాచారం అందిందని కథా రచయిత వేంపల్లి షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన రచించిన కథా సంపుటి చారలపిల్లి ఇతర కథల సంపుటి నుంచి దారి తప్పిన కల, చారులపల్లి, కోయేట్ లెక్క, నల్లబండ, నీలంరంగు రాయి, ఉంగరం, నీలం రంగు రాయి కథలను 14 వ తేదీ నుంచి ప్రసారం చేస్తారని పేర్కొన్నారు. షరీఫ్ కథానికా ప్రపంచంలో విశేషమైన కృషి చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికచేసి ప్రసారం చేసింది.

కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వామ్యం కావాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని విశ్వమాతా ఛారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. శ్రీ ఘంటసాల కళాసమితి 42వ వార్షికోత్సవం శ్రీలలిత కళాస్రవంతి సహకారంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసముందన్నారు. వాణిజ్య పన్నుల అధికారి గద్దె నాగేశ్వరరావు కళాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసముందని అన్నారు. ఘంటసాల కళాసమితి వ్యవస్థాపకుడు పీవీఎన్ శర్మ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు కే బలరామకృష్ణమూర్తి, మహానటి సావిత్రి సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పరచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనారామన్, సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు బోడి ఆంజనేయరాజు సంస్థ కార్యక్రమాలను అభినందించారు. గాయనీ గాయకులు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, మీనాకుమారి, వడ్డాది కామేశ్వరీలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.